సాక్షి

అన్నమయ్య జిల్లా

మంగళవారం । 26 । నవంబర్ । 2024



నీ భూమి కాపాడుకోవయ్యా..!

దేవుళ్లనూ భూ కష్టాలు వెంటాడుతున్నాయి. బి.కొత్తకోట చెన్నకేశవస్వామి ఆలయ మాన్యం తగ్గిపోయింది. -8లో



క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.480	రూ.560
రెండోరకం	రూ.320	రూ.468



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 166 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	--	--
సీబీ	610	610



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 145.320 కిలోలు

న్యూస్‌రీల్

నియామకం

బి.కొత్తకోట : బి.కొత్తకోట చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన సర్వేనంబర్ 1726/1, 1840లోని భూమిలోని ఇసుక నిల్వలు తరలించుకోవడంపై ప్రభుత్వం విచారణాధికారిని నియమించింది. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి సోమవారం ఆదేశాలు వచ్చాయి. దేవదాయ, ధర్మాదాయశాఖ కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఎన్.రామాంజనేయులను నియమించారు. ఇసుకను ఏ మేరకు తరలించుకున్నారు, భూమి పరిస్థితి ఏమిటి, తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారి విశ్వనాథ్ ధ్రువీకరించారు. కాగా ఇసుక వ్యవహారంపై కనీస చర్యలు తీసుకోలేదని బి.కొత్తకోట ఆలయాల ఈవో మునిరాజపై ఇప్పటికే కమీషనర్ అభియోగాలను నమోదు చేసిన విషయం తెలిసిందే.

జనగణనతో పాటు కులగణన జరపాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు

రాయచోటి (జగదాంబసెంటర్) : జనగణనతో పాటు కులగణన కూడా చేయాలని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు వారు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కులగణన జరగకపోవడం వల్ల తక్కువ జనాభా ఉన్న కులాల వారికి సరైన న్యాయం, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా వారికి రావాల్సిన రాయితీలు అందడం లేదన్నారు. ఇప్పుడు చేపట్టే జనగణనతో పాటు కులగణన చేపట్టాలని జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, జిల్లా సెక్రటరీ ఇమామ్, ట్రెజరర్ సుధాకర్, ఉపాధ్యక్షులు బాలాజీ, రాయచోటి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంచుల ఖాదర్‌బాషా, తంబళ్లపల్లి నియోజకవర్గ అధ్యక్షులు చలపతి, రామాపురం మండల అధ్యక్షుడు ధర్మయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఐడీసీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెన్‌డౌన్



పెన్‌డౌన్ ద్వారా నిరసన వ్యక్తం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వేతన బకాయిలు సత్వరమే చెల్లించాలని, లేకుంటే ఈ నెల 25 నుంచి పెన్‌డౌన్ చేస్తామంటూ ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు గతంలోనే తెలిపారు. ఉద్యోగ భద్రతపైనా కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌శాఖలో విలీనం చేయాలని బాధితులు కోరుతున్నారు. కూటమి సర్కార్ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో గత్యంతరం లేని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం నుంచి పెన్‌డౌన్ చేపట్టారు. కడపలోని ఏపీఎస్‌డీసీ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ ద్వారా నిరసన వ్యక్తం చేశారు.

నిత్యపూజస్వామికి రూ.1,25,365 ఆదాయం

సిద్దవటం : మండలంలోని లంకమల్ల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.1,25,365 వచ్చిందని జిల్లా దేవదాయ శాఖ అధికారి మల్లికార్జునప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి ఆయన మాట్లాడుతూ 18 నవంబర్ 2024 నుంచి 25 నవంబర్ 2024 వరకు భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలు, ఆదాయాన్ని దేవదాయశాఖ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాప్రసాద్‌రెడ్డి, రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్ సమక్షంలో లెక్కించామన్నారు కార్యక్రమంలో ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి, అర్చకులు, పోలీసులు, ఆలయ సిబ్బంది చంద్ర, స్థానిక భక్తులు సుబ్బారెడ్డి, వంతాటిపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంటలబీమా పోస్టర్ విడుదల

కడప ఎడ్యుకేషన్ : ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయే రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకే పంటలబీమా ప్రవేశపెట్టారని జిల్లావ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో జరిగిన డీఎల్ఎంసీ సమావేశంలో పంటలబీమా పోస్టర్లను వ్యవసాయ కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఏడీ మాధవి పాల్గొన్నారు.

ఒంటిగంటకే ఫైనల్ బెల్

మధ్యాహ్నం ఒంటి గంట అయితే చాలు.. ఆ హైస్కూల్‌లో ఫైనల్ బెల్ కొట్టేస్తారు. వేసవి సహా కాలం ఏదైనా.. సోమ, మంగళ, బుధ.. రోజు ఏదైనా ఆ స్కూల్‌కు రోజూ ఒంటిపూట బడే. ఒకటి రెండు కాదు.. మూడు దశాబ్దాలుగా ఒంటిపూటే నడిచే ఏకైక హైస్కూల్‌గా రికార్డులకెక్కింది. అదే అన్నమయ్య జిల్లా నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్. ఐఏఎస్‌ల హైస్కూల్‌గా పేరొందిన ఈ హైస్కూల్‌కు 30 ఏళ్ల క్రితం పట్టిన గ్రహణం ఇప్పటికీ వీడటం లేదు.

- రాష్ట్రంలో ఏకైక ఒంటిపూట బడి
- విద్యార్థులకు శాపంగా మారిన ఇంటర్ బోర్డు నిర్వాకం
- 30 ఏళ్లుగా షిఫ్ట్ పద్ధతిలోనే చదువులు
- పడిపోతున్న 'ఐఏఎస్‌ల'హైస్కూల్ విద్యాప్రమాణాలు



నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల కూడా ప్రాంగణంలోనే..

రాజంపేట : ఎందరో ఐఏఎస్‌లను, రాజకీయ ప్రముఖులను అందించిన నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఇంటర్‌మీడియెట్ బోర్డు పాతాళంలోకి తొక్కేస్తోంది. 30 ఏళ్ల క్రితం తాత్కాలికంగా కళాశాల తరగతులు నిర్వహించుకుంటామని చేరి శాశ్వతంగా అలాగే ఉండిపోయింది. దీంతో ఇటు హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్నం వరకు.. అటు కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తరగతులు నడుస్తున్నాయి. కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. 1908లో నందలూరులో బోర్డు హైస్కూల్ ఏర్పాటైంది. 1954లో జిల్లా పరిషత్ హైస్కూల్.. ఆ తర్వాత 1962లో జిల్లా హయ్యర్ సెకండరీ హైస్కూల్‌గా ఆవిర్భవించింది. ఒకప్పుడు విశాలమైన గదులు, లైబ్రరీ, ల్యాబ్, క్రీడా పరికరాలతో పాటు నాణ్యమైన బోధన, ఉత్తమ ఉపాధ్యాయులతో క్రమశిక్షణకు మారుపేరుగా హైస్కూల్ ఖ్యాతిగాంచింది. ఎందరో ఐఏఎస్‌లను అందించి చరిత్రలో నిలిచింది. ఇక్కడి హైస్కూల్‌లో తరగతులు ఉదయం 7.45కు ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారు.

జూనియర్ కళాశాల రాకతో హైస్కూల్ విద్యకు గ్రహణం

నందలూరు బస్టాండు నుంచి సౌమ్యనాథ ఆలయానికి వెళ్లే మార్గంలో విశాలమైన స్థలంలో ఈ హైస్కూల్ ఉంది. భవనాల కొరతతో 1982లో నందలూరులోని జూనియర్ కళాశాలను ఇక్కడికి మార్చారు. అంతే.. ఆ రోజు నుంచి హైస్కూల్ సమస్యల ఒడిలోకి జారుకుంది. సొంతభవనాల నిర్మాణం వరకు అని చెప్పిన ఇంటర్ బోర్డు నేటి వరకు ఇక్కడే కళాశాలను కొనసాగిస్తోంది. ఇక్కడి నుంచి కళాశాలను తరలించాలని జెడ్పీ హైస్కూల్ యాజమాన్యం ఎన్నిసార్లు మొత్తుకున్నా.. కలెక్టర్లు జోక్యం చేసుకున్నా ఫలితం లేదు. ప్రస్తుతం 274 మంది విద్యార్థులున్న ఈ హైస్కూల్‌లో మధ్యాహ్నం వరకు తరగతులు సాగుతున్నాయి. మధ్యాహ్నం నుంచి ఇంటర్ విద్యను కొనసాగిస్తున్నారు. షిఫ్ట్ విధానంపై విద్యార్థుల తిరుగుబాటు, ఆందోళనలు, ఉద్యమాలు జరిగినా పట్టించుకున్న పాపానపోలేదు.

రూ.లక్షలు వెనక్కి..

ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఈ షిఫ్ట్ విధానానికి స్వస్తి పలకాలని భావించారు. గత ప్రభుత్వంలో లక్షలాది రూపాయలు మంజూరు చేయించారు. పీహెచ్‌సీకి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. నిర్మాణ పనులు చేపట్టే సమయంలో వివాదాలు తలెత్తాయి. అంతే పెండింగ్‌లో పడింది. జూనియర్ కళాశాలను మండల కార్యాలయాల కాంప్లెక్స్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్‌ను కేటాయించి అక్కడికి తరలించాలని ప్రయత్నించారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఇంటర్ విద్యకు ఎస్సీ హాస్టల్‌ను ఆధునికీకరణ చేసి సరిపోతుందని భావించి ఆ దిశగా చర్యలు తీసుకున్నారు.

వ్యతిరేకిస్తున్న అధ్యాపకులు

ఏదో ఒక పూట వస్తున్నాం.. పాఠాలు చెప్పిపోతున్నాం.. అక్కడికి తరలిస్తే రెండు పూటలా కాలేజీకి రావాల్సి వస్తుంది అనుకున్నారో ఏమో... ఇంటర్ కళాశాలను తరలింపును కొందరు అధ్యాపకులు వ్యతిరేకిస్తున్నారు. మండల కాంప్లెక్స్ సమీపంలోని ఎస్సీ హాస్టల్ భవనాలు దూరమని.. అక్కడికి వెళితే ఇంటర్ బాలికలకు రక్షణ ఉండదని ప్రచారం చేశారు. నిజానికి మండల కాంప్లెక్స్ ఆవరణ ప్రశాంతంగా ఉంటుంది. దశాబ్దాలుగా అక్కడే వందలాది మంది బాలికలతో బీసీ గురుకుల పాఠశాల కూడా ఉంది. కేవలం తమ స్వార్థం కోసం అధ్యాపకులు చేసిన వ్యవహారం వల్ల తరలింపు ఆగిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, డీఈవో, ఇంటర్ ఆర్‌జెడీ ఒకతాటిపైకి వచ్చి హైస్కూల్‌కు ఒంటిపూట బడి నుంచి విముక్తి కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐఏఎస్‌ల హైస్కూల్‌గా ప్రసిద్ధి

ఐఏఎస్‌లను.. గొప్ప రాజకీయ నాయకులను దేశానికి అందించిన స్కూల్‌గా ఇది ఖ్యాతి గడించింది. జి.జగత్పతి, ఎ.ఉమాకాంతశర్మ, తిరువెంగళాచార్యులు, ఆకేపాటి విజయసాగర్‌రెడ్డి, జి.పెద్దరెడ్డయ్య ఈ హైస్కూల్‌లోనే చదివి ఐఏఎస్‌లయ్యారు. మాజీ గవర్నర్ ఎస్.ఓబులరెడ్డి, మాజీ మంత్రి బండారు రత్నసభాపతి, ఎంపీలు యెద్దుల ఈశ్వర్‌రెడ్డి, వై.ఆదినారాయణరెడ్డి, డీఎస్ రెడ్డి వంటి దిగ్గజాలు ఈ హైస్కూల్‌లో విద్య అభ్యసించినవారే. జిల్లా బోర్డు అధ్యక్షుడిగా పనిచేసిన వై.పిచ్చిరెడ్డి, అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఏబీ ఆదిశేషారెడ్డి, బ్రిగేడియర్ వి.శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్ మోహనరెడ్డి, ఐఎఎస్‌ల సృష్టికర్త ఆర్‌సీ రెడ్డి, ఐటీఎస్ ఎంవీ రమణయ్య, ఆర్టీసీ రీజినల్ మాజీ ఛైర్మన్ యెద్దల సుబ్బరాయుడుతో పాటు ఎందరో క్రీడాకారులుగా, ఉన్నతాధికారులుగా, ప్రజాప్రతినిధులుగా రాణించారు.

జూనియర్ కళాశాలను తొలగించాలి



జూనియర్ కళాశాల సొంత భవనాల కోసం రెండుసార్లు నిధులు మంజూరయ్యాయి. లాభం లేకపోయింది. పీహెచ్‌సీకి సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని జూనియర్ కళాశాల కోసం ఎంపిక చేశాం. దాన్ని అడ్డుకున్నారు. కళాశాలను ఎస్సీ హాస్టల్ భవనాల్లోకి మార్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ.. ఉద్దేశపూర్వకంగా కొందరు అధ్యాపకులు వ్యతిరేకించారు.

-మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ, నందలూరు

షిఫ్ట్ విధానం సరికాదు



ఐఏఎస్‌ల పాఠశాలగా దీనికి గుర్తింపు ఉంది. ఎందరో ఐఏఎస్‌లను అందించిన హైస్కూల్ నేడు విద్యాపరంగా దీనావస్థలో ఉంది. ఒకప్పుడు రెండుపూటలు జరిగేది. ఒక పూటకే పరిమితం కావడంతో విద్యార్థులకు బోధన కరువైంది. ఇంటర్ కళాశాలను వేరే ప్రాంతానికి తరలిస్తేనే హైస్కూల్ విద్య సక్రమంగా నడుస్తుంది. ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు.

-సోమిశెట్టి సునీత, ఎంపీటీసీ, నందలూరు

ఏళ్ల తరబడి ఇదే దుస్థితి



నందలూరు హైస్కూల్‌లో ఏళ్ల తరబడి ఇంటర్ కళాశాలను కొనసాగింపును ఆపలేకపోతున్నారు. ఇంటర్ కళాశాలకు స్థలం, నిధులొచ్చినా ఉపయోగించలేకపోయారు. తరువాత నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్ భవనాల్లోకి తరలిస్తే కొంతమంది అధ్యాపకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుకున్నారు.

-సుభాన్‌బాషా, ఎంపీటీసీ, నందలూరు

స్మార్ట్ దోపిడీ!

కరెంట్ టాపిక్

- ఒక్కో స్మార్ట్ మీటర్‌కు రూ. 12 వేలు
- రీచార్జ్ చేస్తేనే కరెంటు.. లేదంటే కట్..



స్మార్ట్ మీటరు

జిల్లా వ్యాప్తంగా **6** లక్షల విద్యుత్ గృహ సర్వీసులు | **1.23** లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందకు రాబోతున్నాయి.

గాలివీడు : జిల్లాలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇకపై విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీ పెయిడ్ పద్ధతిలోకి మారనుంది. సెల్‌ఫోన్‌కు టాక్‌టైం రీచార్జ్ చేసుకున్నట్లుగానే ఇకపై విద్యుత్‌ను కూడా ముందుగా డబ్బు చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నమాట. ఈ విధానం వినియోగదారుడికి భారంగా మారనుంది. ఒక్కో స్మార్ట్ మీటర్‌ను రూ.12 వేలు పెట్టి కొనాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. రైతుల పరిస్థితి ఇక చెప్పనక్కర లేదు. స్మార్ట్ మీటర్లు తమ పాలిట శాపంగా మారుబోతున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

విడతల వారీగా

విడతల వారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. మొదటి విడతగా విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో పాటు మిగతా ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తయ్యాక రెండో విడతగా వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియ మొదలవుతుంది. మూడో విడతగా గృహలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు.

రీచార్జ్ చేసుకుంటే కరెంట్.. లేదంటే కట్

స్మార్ట్ మీటర్లను వినియోగించుకుంటే నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీచార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీచార్జ్ చేయాలంటే ఆన్లైన్లో మళ్లీ రిజిస్టర్ చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు.. ముఖ్యంగా మహిళలకు కష్టమనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

ఉపాధిపై దెబ్బ

జిల్లాలో మొదటగా మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల్లో స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా విద్యుత్ సంస్థను నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలైతే వారి ఉపాధికి పెద్ద దెబ్బే పడుతుంది. ఇదే జరిగితే జిల్లాలో దాదాపు 300 నుంచి 500 మంది దాకా ఉపాధి కోల్పోనున్నారు.

స్మార్ట్ మీటర్ల వల్ల నష్టం ఉండదు..



స్మార్ట్ మీటర్లు పెట్టుకోవడం ద్వారా వినియోగదారులకు నష్టం ఉండదు. సెల్ ఫోన్లకు ముందుగా ఎలా రీచార్జ్ చేసుకుంటామో అలాగే స్మార్ట్ మీటర్లకు కూడా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సిస్టం రావడం వలన విద్యుత్ శాఖకు బిల్లులు పెండింగ్ ఉండవు రెగ్యులర్గా బిల్లుల చెల్లింపులు జరుగుతాయి ఎలాంటి సమస్యలు ఉండవు.

– చంద్రశేఖర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ

నాడు వ్యతిరేకించి.. నేడు అమలు చేయడం దారుణం



ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించింది. మీటర్లను పగలగొడతామని చెప్పింది. విద్యుత్ చార్జీలు పెంచబోమని వాగ్దానం చేసింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై రకరకాల పేరుతో విద్యుత్ భారాలు మోపడం దారుణం. టీడీపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలి.

– సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

స్మార్ట్ మీటర్ల వల్ల గృహిణులకు ఇబ్బందులు



ఇంట్లో వంట పనులు చేసుకునేటప్పుడు, మిక్సీ, గ్రైండర్లు వేసేటప్పుడు రీఛార్జ్ అయిపోయి కరెంట్ కట్ అయితే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మళ్లీ రీచార్జ్ చేసేంత వరకు అలాగే ఉండాల్సి వస్తుంది. దీనివల్ల మహిళలు చాలా ఇబ్బందులు పడతారు. రీఛార్జి చేయడానికి మా వద్ద ఉండే ఫోన్లలో డబ్బులు ఉండవు. ఎక్కువగా మగవాళ్ల వద్ద ఉండే సెల్‌ఫోన్లలో మాత్రమే డబ్బులుంటాయి. వారు బయటికి స్త్రీ వెళ్లినప్పుడు రీఛార్జి అయిపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– డి.రామేశ్వరి, గృహిణి, గాలివీడు

బాధ్యతగా ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. బాధితుల సమస్యను సావధానంగా విని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులు అవగాహనతో పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూధనరావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగళ్లులో భూ దందా!



అంగళ్లులో హైవేపై ధర్నా చేస్తున్న తుమ్మ చెట్లపల్లె వాసులు



అంగళ్లులోని టూట్వంటీ భూమిలో వాహనాల్లో వచ్చి హల్‌చల్ చేస్తున్న బయటి వ్యక్తులు

- బయటి వ్యక్తులు హల్‌చల్
- నిరసనగా హైవేపై రాస్తారోకో
- మళ్లీ తెరపైకి టూ ట్వంటీ రగడ

కురబలకోట : మండలంలోని అంగళ్లు కదిరి రోడ్డు హైవే పక్కన ఉన్న సర్వే నెంబరు టూట్వంటీ (220) భూ పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇది మరోసారి వివాదాస్పదంగా మారింది. ఇక్కడ మూడు ఎకరాల భూమి ఉంది. దీని కోసం గతంలో బయటి ప్రాంతం వారు వచ్చి తమదేనంటూ హల్‌చల్ చేశారు. అప్పట్లో వీరితో సెటిల్ మెంట్ చేసుకుని అందులో అంగళ్లుకు చెందిన మునుపటి ఆసామికే భూమిని అప్పగించారు. క్రయవిక్రయాలు జరిగాయి. కట్టడాలు కూడా నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం బయట నుంచి వచ్చిన సుమారు 35 మంది కొత్త వారు ఒక్కసారిగా ఆ భూమిలోకి చొరబడ్డారు. జేసీబీతో భూమిని చదును చేయసాగారు. బయటి వ్యక్తులు భూ కబ్జా చేస్తున్నారన్న సమాచారంతో తుమ్మచెట్లపల్లెకు చెందిన సూరి గ్రామస్థులతో అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇందుకు నిరసనగా హైవేపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు జోక్యం చేసుకుని రాస్తారోకో విరమింపజేశారు. బయట నుంచి వచ్చిన వారిని కూడా అక్కడి నుంచి తాత్కాలికంగా విరమింపజేశారు. భూ వివాదాన్ని చర్చలు లేదా కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు హెచ్చరించడంతో వెళ్లిపోయారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పూజలు



అత్తిరాల ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాల వెలుగులు

కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. ఆలయ ప్రాంగణాలు శివనామస్మరణతో మారుమోగాయి. కార్తిక దీపారాధనతో ఆలయాలు కాంతులీనాయి. అత్తిరాలలో ఘనంగా పూజలు జరిగాయి. మహిళలు ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఇక వైఎస్సార్ జిల్లాలోని పుష్పగిరిలో తెల్లవారుజాము నుంచే భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వర స్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు.

-సాక్షి నెట్‌వర్క్



కడపలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పుష్పగిరి కొండపైన శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొన్న కారు

– వ్యక్తికి గాయాలు

నందలూరు : కడప–చెన్నై ప్రధాన జాతీయ రహదారిలోని కన్యకాచెరువు కట్టపై ఉన్న పెట్రోల్ బంకు వద్ద సోమవారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో బైకు నడుపుతున్న వ్యక్తి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చెన్నయ్యగారిపల్లెకు చెందిన నరసింహులు పెట్రోల్ కోసం రోడ్డు దాటుతున్న సమయంలో కడప నుంచి కోడూరుకు వెళ్తున్న కోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహులు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ నరసింహులును 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటోలో నుంచి పడి వృద్ధుడికి గాయాలు



గాయపడిన గోపాల్‌రెడ్డి

మదనపల్లె : ఆటోలో నుంచి పడి ఓ వృద్ధుడు గాయపడిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. అంగళ్లుకు చెందిన గోపాల్‌రెడ్డి (71) ఆటోలో గోపాలపురానికి వెళుతుండగా మార్గంమధ్యలో ఆటో అదుపు తప్పడంతో.. ఆటోలో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. సోమవారం మండలంలోని రాచవేటివారిపల్లెలో సారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని ఆయన పేర్కొన్నారు. స్థానికులైన పిల్లి రామచంద్ర కుమారుడు పిల్లి నారాయణ సారా విక్రయిస్తుండగా అదుపులో తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు వివరించారు.

వెళ్తున్న బస్సులో నుంచి దూకిన యువతి

- కుమార్తెను కాపాడేందుకు కిందికి దూకిన తల్లి
- ఇద్దరికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్/చక్రాయపేట : పులివెందుల పట్టణంలోని రోటరీపురానికి చెందిన మతిస్థిమితం సరిగా లేని శ్రీలేఖ వెళ్తున్న బస్సులో నుంచి కిందికి దూకింది. ఆమెను కాపాడేందుకు తల్లి సులోచన కూడా కిందికి దూకింది. ఈ సంఘటనలో వారిద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోటరీపురానికి చెందిన సులోచన, రాముడుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తె శ్రీలేఖతో కలిసి తల్లి సులోచన కార్తీకమాసం సోమవారం నాడు రాయచోటి సమీపంలోని శివాలయానికి వెళ్లింది. అనంతరం రాయచోటి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో తిరిగి వస్తున్నారు. చక్రాయపేటలోని పెట్రోలు బంకు వద్దకు రాగానే శ్రీలేఖ బస్సులో నుంచి కిందికి దూకింది. ఆమెను కాపాడేందుకు తల్లి కూడా కిందికి దూకింది. దీంతో వారిద్దరికీ తీవ్ర గా యాలయ్యాయి. వారిని చికిత్స కోసం 108 వాహనంలో వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని వైఎస్ పాల్‌రెడ్డి ఫంక్షన్ హాలు సమీపంలో సోమవారం ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో యమున అనే చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. జ్యోతి ఆసుపత్రి నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా.. కదిరి డిపో నుంచి పులివెందులకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో చిన్నారితోపాటు ఆ చిన్నారి తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి.


చెన్నకేశవస్వామీ.. నీ భూమి గోవిందా..!

- 24.08 ఎకరాలు వేరే ఆలయం పేరుతో నమోదు
- పాత ఖాతా నంబర్, సర్వే నంబర్లతో వివరాలు
- ఆన్‌లైన్‌లో మార్చేశారు
- కొన్నేళ్లుగా పట్టించుకోని దేవదాయ శాఖ

బి.కొత్తకోట : దేవుళ్లనూ భూ కష్టాలు వెంటాడుతున్నాయి. మూడేళ్లుగా నలుగుతున్న ఈ సమస్య వెలుగులోకి వచ్చింది. వంద ఎకరాలకుపైన భూమి కలిగిన బి.కొత్తకోట చెన్నకేశవస్వామి ఆలయ మాన్యం తగ్గిపోయింది. చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన కోట్ల విలువైన భూములు అసలు సెంటు మాన్యం భూమిలేని మరో ఆలయం పేరుతో ఎలా నమోదయ్యాయో జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోటలోని చెన్నకేశవ, ఆంజనేయ, చౌళేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన కోట్ల విలువ చేసే భూములు దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో ఉన్నాయి. ఈ ఆలయాలకు చెందిన భూములకు చెందిన పట్టాదారు పాసుపుస్తకాన్ని 798 ఖాతా నంబర్‌తో ఈఓ పేరుతో జారీ చేసి ఉన్నారు. అందులో ఈ ఆలయాలకు ఏ సర్వే నంబర్లలో ఎన్నేసి ఎకరాల భూమి ఉంది అనే వివరాలు ఉండగా.. కొన్ని సర్వే నంబర్లకు చెందిన భూమి పాసుపుస్తకంలో నమోదు కాలేదు. ఇంత వరకు అంతా సవ్యంగానే ఉంది. అయితే మూడేళ్ల క్రితం దేవదాయ ధర్మాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యమో లేక రెవెన్యూ అధికారుల అలసత్వమో కానీ విలువైన భూములకు ఆలయం పేరు మారిపోయింది. స్థానిక దిగువబస్టాండ్‌లో కొలువైన చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 627లో 8.13 ఎకరాలు, సర్వే నంబర్ 836/1లో 2.81 ఎకరాలు, సర్వే నంబర్ 1840లో 11.22 ఎకరాలు, సర్వే నంబర్ 1842/2లో 1.31 ఎకరాలు, సర్వే నంబర్ 1847/1లో 0.6 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ఖాతా నంబర్ 798తో జారీ అయిన పాత పట్టాదారు పాసుపుస్తకంలో ఈ వివరాలన్నీ ఉన్నాయి. కాగా స్థానిక బీసీ కాలనీలో ఇటీవల వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన మాన్యం భూమి సెంటు కూడా లేదు. అయితే పైన సర్వే నంబర్లలోని చెన్నకేశవస్వామి ఆలయ భూమి మొత్తం వెంకటేశ్వరస్వామి ఆలయ మాన్యం భూములుగా రికార్డుల్లో నమోదు చేసేశారు. ఇంతటితోనే ఈ వ్యవహారం ముగియలేదు. చెన్నకేశవస్వామి భూములతోపాటు ప్రయివేటు భూములను కూడా వెంకటేశ్వరస్వామి ఆలయ భూములుగా నమోదు చేసేశారు. దీనితో సెంటు భూమిలేని వెంకటేశ్వరస్వామి ఉన్నపళంగా కుబేరుడు అయిపోయారు. చెన్నకేశవస్వామి ఆలయ భూమికి పేరు మారిపోవడమేకాక సర్వే నంబర్ 537లో 1.01 ఎకరాలు, సర్వే నంబర్ 737లో 0.28 ఎకరాలు, సర్వే నంబర్ 1358లో 0.56 ఎకరాలు, సర్వే నంబర్ 1726/1లో 8.50 ఎకరాల భూమిని ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. దీనితో ఈ భూమి ఆక్రమణలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ భూముల విలువ కోట్లలో ఉండటంతో ఇప్పటికే ఆక్రమణలకు ప్రయత్నాలు కూడా జరిగాయి. ప్రస్తుతం ఈ భూములను చెన్నకేశవస్వామి ఆలయం పేరిట నమోదు చేయాల్సి వుంది.



బి.కొత్తకోట చెన్నకేశవస్వామి ఆలయం



పాత పట్టాపుస్తకంలో చెన్నకేశవ ఆలయం పేరిట భూములు



ఆన్‌లైన్ వన్‌బీలో వెంకటేశ్వరస్వామి ఆలయం పేరిట భూములు

తప్పెవరిది?

చెన్నకేశవస్వామి ఆలయ భూములు మరో ఆలయం పేరిట నమోదవడానికి కారకులు ఎవరు అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సి వుంది. ఏదైనా భూమి తమదని యజమానులు వివరాలను భూ లెక్కల్లో నమోదు చేయించుకునే సమయంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు పాటిస్తారు. అలాంటి అత్యంత విలువైన ఆలయ భూములు మరో ఆలయం పేరిట ఎలా నమోదయ్యాయి అన్న దానిపై సమగ్ర విచారణ అవసరం.. లేదంటే ఇలాంటి తప్పిదాలు పునరావృతం అయ్యే అవకాశం ఉంది. ఈ సమస్యకు దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు విమర్శిస్తున్నారు. మూడేళ్లుగా దీన్ని సరిదిద్దాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని అంటున్నారు. అయితే వివరాల నమోదులో రెవెన్యూ అధికారుల పాత్రపైనా విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకుంటాం

చెన్నకేశవస్వామి ఆలయ భూములు మరో ఆలయం పేరిట నమోదైన విషయాన్ని దేవదాయ ధర్మాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ దృష్టికి తీసుకెళ్లగా.. చర్యలు తీసుకుంటామని చెప్పారు. కిందిస్థాయి ఆలయ పర్యవేక్షకుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొంటున్నాయని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులు, సంరక్షకులదే

- చెడు అలవాట్లకు దూరంగా వుండేలా చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : పిల్లలు ఉదయం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి.. సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత అనవసరంగా బయట తిరగనీయరాదని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఆయన సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు కొన్ని సూచనలు చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా, ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించినా అలాంటి ఫిర్యాదులు స్కూల్, కాలేజీ యాజమాన్యం నుంచి వచ్చినా టీసీలు ఇచ్చి ఇంటికి పంపిస్తారన్నారు. మరే ఇతర స్కూల్, కాలేజీలో చేర్చుకోని విధంగా చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతటి వారైనా అందరికీ ఒకే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. తమ పిల్లలు ఎక్కడికి వెళుతున్నారు? ఏం చేస్తున్నారు? ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నారు? ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారు? దుర్వ్యసనాలకు పాల్పడుతున్నారా? అనే విషయాలపై పూర్తి స్పృహ కలిగి వుండాలన్నారు. ఎప్పటికప్పుడు వారి కదలికలపై దృష్టి సారిస్తూ వుండాలన్నారు. పిల్లలకు ఫోన్‌లు, పర్సనల్ కంప్యూటర్లు ఇవ్వడం చేయరాదన్నారు. ఇవ్వాల్సిన పరిస్థితి వస్తే వాటి వినియోగంపై పూర్తి నిఘా వుంచాలన్నారు. అనధికారిక లింక్‌లు టచ్ చేయడం వల్ల కోరి ప్రమాదం తెచ్చుకునే అవకాశం వుందన్నారు. పిల్లలు ధరించే దుస్తులు, హెయిర్ కటింగ్‌పై శ్రద్ధ వహించాలన్నారు. శారీరక శ్రమ అందించే క్రీడలను ప్రోత్సహించి, చెడు అలవాట్లకు దూరంగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మీ పిల్లలు చెడు వ్యసనాలకు దూరంగా వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ మీకు చెడు వ్యసనాలు (తాగుడు, గంజాయి, మత్తు మందులు ఇతరత్రా) అలవాటు ఉంటే, వాటి బారిన పడకుండా చూడాలన్నారు. మీ పిల్లలను ఒక కంట కనిపెడుతూ ఉండాలన్నారు. ప్రేమగా చూసుకోవడం మంచిదే కానీ అతి ప్రేమతో వారిని మొండి వారిగా తయారు చేయడం వల్ల సమస్యలు ఎదురవుతాయన్నారు. యువత మత్తుకు బానిసలుగా మారుతున్నారన్నారు. కుటుంబాలు, జీవితాలను నాశనం చేసుకుని అర్ధాంతరంగా ముగించుకుంటున్నారన్నారు. పిల్లలపై పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తూ, చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మికత నేర్పించాల్సిన అవసరముందన్నారు. గంజాయి తదితర మాదకద్రవ్యాల మీద పూర్తి నిఘా పెంచామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మీ పరిధిలో ఎవరైనా మీకు తెలిసి మత్తు పదార్థాలు ఇచ్చేవారు, అమ్మేవారు వుంటే పోలీసులకు తెలియజేసిన పక్షంలో వారిని అదుపులోకి తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామన్నారు. పిల్లల విషయంలో 'మొక్కై వంగనిది మానై వంగదని' తల్లిదండ్రులు గమనించాలని వివరించారు.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్ విజేత విశాఖపట్నం

మదనపల్లె సిటీ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 నెట్‌బాల్ బాలికల విభాగం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత, రాష్ట్ర అబ్జర్వర్ రామాంజనేయులు, ఎఈంఓ రాజగోపాల్, హెచ్‌ఎం ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు నాగరాజ, నరేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్–17 నెట్‌బాల్ బాలికల విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖపట్నం విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానం వెస్ట్‌గోదావరి, తృతీయస్థానం కృష్ణా జిల్లాలు సాధించినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత తెలిపారు. రాష్ట్ర జట్టు డిసెంబర్‌లో పంజాబ్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.



విశాఖపట్నం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

హిందూజా (వెస్ట్ గోదావరి), వెంకటరేష్మ (వెస్ట్ గోదావరి), జాగారపు ప్రణతి(విశాఖపట్నం), సుప్రియ (కృష్ణ), సాత్విక (కడప), హన్సిక్ (అనంతపురం), కళ్యాణిరేవతి(ఈస్టు గోదావరి), భీష్మా (చిత్తూరు), భానుప్రియ (గుంటూరు), వర్షి (చిత్తూరు), రిషిత (విశాఖపట్నం)

స్టాండ్‌బైలు : చంద్రకళ (చిత్తూరు), శిరీషా (విశాఖపట్నం), పోషిత (వెస్ట్ గోదావరి), పూజిత (కృష్ణ), సింధూరి (వైఎస్సార్ కడప)

సీఐ తల్లి హత్య కేసులో నిందితుడి ఆత్మహత్యాయత్నం

- అలస్యంగా గుర్తించిన పోలీసులు

మదనపల్లె : రాష్ట్రంలో సంచలనం రేపిన ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి పేరం స్వర్ణకుమారి హత్య కేసులో రెండో నిందితుడైన అనిల్‌కుమార్ ఆదివారం ఆత్మహత్యకు ప్రయత్నించగా, పోలీసులు ఆలస్యంగా గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి, మదనపల్లె పట్టణంలోని సాయిరాంవీధిలో నివసిస్తున్న అనిల్‌కుమార్(25), అతని తల్లి రమాదేవి.. సెప్టెంబర్ 28న కనిపించకుండా పోయి హత్యకు గురైన స్వర్ణకుమారి హత్య కేసులో నిందితులు. ఇదే కేసులో ప్రధాన నిందితుడు వెంకటేష్‌ను అక్టోబర్ 9న, అతని తల్లి ఏ4గా ఉన్న ఎల్లమ్మను 10వ తేదీన మదనపల్లె తాలూకా పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో హత్య కేసులో రెండో నిందితుడైన అనిల్‌కుమార్, అతని తల్లి రమాదేవిలు పోలీసుల దర్యాప్తులో దొరకకుండా పరారీలో ఉన్నారు. అయితే అనిల్‌కుమార్ ఆదివారం గుట్టుచప్పుడు కాకుండా మదనపల్లెకు వచ్చారు. స్థానికంగా కొందరు అతడిని గుర్తుపట్టడంతో, తాము పోలీసులకు దొరికిపోతామన్న భయంతో తిరిగి పారిపోయాడు. ములకలచెరువు మార్కెట్‌యార్డు వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడ ఎవరూ గుర్తించకపోవడంతో రాత్రి మార్కెట్‌యార్డు వద్ద అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈలోపుగా 108 సమాచారం అందించి బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అపస్మారకస్థితిలో స్పష్టంగా మాట్లాడలేక ఆస్పత్రికి చేరిన అనిల్‌కుమార్‌కు స్థానిక వైద్యులు చికిత్స అందించారు. ఈలోపుగా సీఐ తల్లి హత్య కేసులో నిందితుడు ఇతడేనని పోలీసులకు తెలియడంతో హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని అనిల్‌కుమార్‌కు పోలీసు పహారా ఏర్పాటు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో సోమవారం మధ్యాహ్నం వరకు చికిత్స అందించారు. అనంతరం పోలీసులు అనిల్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.



ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిల్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీసు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. సబ్ డివిజన్, సర్కిల్, పోలీస్ స్టేషన్‌ల పరిధిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలన్నారు. బాధితుల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని చట్టపరిధిలో విచారణ చేసి, న్యాయం చేయడానికి జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే విచారణ చేసి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

ఉద్యోగ భద్రతపై వలంటీర్ల ఆందోళన



రాయచోటిలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వలంటీర్లు

రాయచోటి/రాజంపేట/మదనపల్లె సిటీ : ఎన్నికల్లో తమకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరుతూ వలంటీర్లు ఆందోళన బాట పట్టారు. సోమవారం అన్నమయ్య జిల్లాలోని రాయచోటి కలెక్టరేట్, రాజంపేట, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన తెలియజేశారు. రాయచోటిలో ఏఐవైఎఫ్, ఏపీ వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, మదనపల్లెలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఫయాజ్ మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లకు గౌరవవేతనం నెలకు రూ.10 వేలు ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ ఐదు నెలలు అవుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వలంటీర్లు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వలంటీర్లు పనిలో లేరని, జీవో లేదని అనడం చూస్తే.. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మదనపల్లెలో ఏఐటీయుసీ పట్టణ కార్యదర్శి తిరుమల, వలంటీర్లు గౌతమి, సునంద, స్వర్ణ, స్వాతి, మురళి, వెంకటాచలపతి, సుమిత్ర, తులసనమ్మ, వనజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

- సాగునీటి కాలువలో సిమెంటు రోడ్డు
- ఆపాలంటున్న ఆయకట్టు రైతులు

ఓబులవారిపల్లె : మండల పరిధి రాళ్లచెరువుపల్లె గ్రామ సమీపంలోని కాలువలో ఇష్టానుసారంగా సిమెంట్ రోడ్డు వేసేందుకు కంకరను ఏర్పాటు చేశారు. రాళ్ళచెరువుపల్లె చెరువు నుంచి ఆర్‌సీ కొత్తపల్లి గ్రామానికి ఈ కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం వర్షాలు లేక కాలువలలో నీరు సాగడం లేదు. అదే అదునుగా కాలువలో తూము ఏర్పాటు చేయకుండా.. ఏకంగా సిమెంట్ రోడ్డు వేసేందుకు గుత్తేదారులు సిద్ధం చేస్తున్నారు. కేవలం తమ పంట పొలాల వద్దకు వెళ్లేందుకు చెరువు నుంచి వచ్చే కాలువలో అడ్డంగా రోడ్డు వేయడం ఏమిటని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ పంటలు భవిష్యత్తులో ఎలా సాగు చేసుకోవాలని, పంట పొలాలను సాగు చేసుకోవాలంటే తూము ఏర్పాటు చేయాలని, కావున ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జనావాసాలు లేని చోట సిమెంట్ రోడ్డును ఇష్టానుసారంగా వేయడం విడ్డూరంగా ఉందని, ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కావున సంబంధిత అధికారులు కాలువలో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కాలువలో సిమెంట్ రోడ్డు వేసేందుకు తోలిన కంకర

అక్రమ మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్

బద్వేలు అర్బన్ : అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. సోమవారం స్థానిక బయనపల్లె చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్న ఒక జేసీబీ, 7 ట్రాక్టర్లను తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇటీవల కాలంలో బద్వేలు మండల పరిధిలోని పలు చెరువులలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛా డ్యామ్ సమీపంలో ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి.బాలిరెడ్డి మార్గనిర్దేశంతో రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్‌ఐ కృపానందకు చెందిన ఆర్‌ఎస్‌టీ రాఘవేంద్ర టీం, రాజంపేట సెక్షన్‌లోని పింఛా డ్యామ్ వైపు కూంబింగ్ చేపట్టారు. ఆరోగ్యపురం సమీపంలోని చెయ్యేరు వద్ద కొందరు వ్యక్తులు చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధురాలి ఆత్మహత్య



రామసుబ్బమ్మ మృతదేహం

కురబలకోట : నయం కాని రోగాలతో ఎందుకీ జీవితం అనుకుని ఎక్కువ మాత్రలు మింగి మండలంలోని తెట్టు వీఆర్‌ఏ క్రిష్టప్ప భార్య రామసుబ్బమ్మ (62) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ముదివేడు పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామసుబ్బమ్మకు వయసుపైబడటంతో కంటి చూపు మందగించింది. దీనికి తోడు వళ్లు నొప్పులు వేధించసాగాయి. మరో వైపు షుగర్ జబ్బుతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమె కళ్లు సరిగ్గా కన్పించడం లేదని ఆపరేషన్ చేయించాలని కుటుంబీకులకు చెప్పింది. దీంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా షుగర్ తగ్గితే ఆపరేషన్ చేస్తామని డాక్టర్లు చెప్పారు. దీంతో ఇంటి పట్టున ఉంటోంది. ఒక వైపు కళ్లు కన్పించకపోవడం మరో వైపు అనారోగ్యం ఇంకో వైపు షుగర్ తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. చనిపోవాలని ఇంట్లో ఉన్న మాత్రలు ఆదివారం ఎక్కువగా వేసుకుంది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబీకులు గమనించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారి జామున మృతి చెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మా భూములు అప్పగించాలి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామంలో ఇది వరకే అసైన్‌మెంట్ కమిటీలో దాదాపు 100 మందికిపైగా పట్టాలు ఇచ్చారని, కానీ అవి ఆక్రమణకు గురి కావడంతో తమ భూములు తమకు ఇప్పించాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బాధితులు ఒంటిమిట్ట మండలం సీపీఐ నేత కట్టా యానాదయ్య ఆధ్వర్యంలో ఒంటిమిట్ట తహసీల్దార్ కార్యాలయం వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో తమ పేర్లతో భూములు ఉన్నాయని, తాము పాసు పుస్తకాలు పొందామని, ప్రభుత్వం రైతు భరోసా ఇస్తోందని, కానీ ఆ భూములలోకి తమను రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇంత వరకు సబ్ డివిజన్ కాలేదని, ఈ విషయమై రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని అందువల్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. తహసీల్దార్ వెంకట రమణమ్మ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ అంజనా గారికి వినతిపత్రం అందజేశారు.

వింత వ్యాధితో ఆవులు మృతి



సరస్వతిపల్లెలో మృతి చెందిన దూడ

రామాపురం : ఆవులు వింత వ్యాధితో మృతి చెందుతుండటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో ఏళ్లుగా బిడ్డల లాగా పోషించుకున్నామని, కళ్లెదుటే చనిపోతుండటంతో తట్టుకోలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్త చేశారు. మండలంలోని సరస్వతిపల్లె దళితవాడలో నెల రోజులుగా ఒంగోలు జాతి ఆవులకు, దూడలకు చర్మంపై బొబ్బలు రావడం, వారం రోజులలో తల వాపునకు గురై మృత్యువాత పడుతున్నాయి. ఈ వారంలోనే వీరనాగయ్యకు చెందిన దూడ, ఈశ్వరయ్య, నాగులయ్యకు చెందిన ఒంగోలు జాతి ఆవులు, దూడలు మృతి చెందాయి. చర్మంపై పెద్దగా బొబ్బలు రావడంతో వెంటనే పశువుల ఆసుపత్రిని సంప్రదిస్తే అక్కడి సిబ్బంది పట్టించుకోవడం లేదని, మందులు ఇక్కడ లేవని బయటికి వెళ్లి కొనుగోలు చేయాలని చీటి రాసిచ్చారని, ఎన్ని మందులు వాడినా ప్రయోజనం కన్పించలేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రతి ఇంటిలో పశువులు ఉన్నాయని, ఈ దిక్కుమాలిన వ్యాధితో ఎన్ని కోల్పోవాల్సి వస్తుందోనని వారు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పశువైద్యాధికారులు స్పందించి పాడి రైతులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వివరణ : మండల పశువైద్యాధికారి వెంకటరమణను 'సాక్షి' వివరణ కోరగా 2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మందులు ప్రభుత్వం నుంచి అందలేదని, తామేమి చేయాలని చెప్పారు.

ఆటో అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ఓబులవారిపల్లె : ముక్కవారిపల్లి జాతీయ రహదారిపై సోమవారం ఉదయం పాత ఇనుప సామాన్ల ఆటో అదుపు తప్పడంతో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఆటోలోని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రాజంపేట నుంచి ఆటోలో గ్రామాలలో పాత ఇనుప సామాన్లు సేకరించేందుకు వెళ్తుండగా.. అమృతవారిపల్లి స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పడంతో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న డ్రైవర్, అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 వాహనంలో రైల్వేకోడూరుకు చికిత్స నిమిత్తం తరలించారు. వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ మహేష్ తెలిపారు.